క్లుప్తంగా

రేపు మెగా కంటివైద్య శిబిరం



మాగనూర్(కృష్ణా): కృష్ణా మండలం కున్సి రైతువేదికలో మంగళవారం కందూరు రాంరెడ్డి లయన్స్, వాకిటి శ్రీహరన్న సేవాసమితి ఆధ్వర్యంలో మెగా కంటివైద్య శిబిరం నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాజప్పగౌడ తెలిపారు. కంటివైద్య శిబిరానికి సంబంధించిన పోస్టర్లను ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు శిబిరం కొనసాగుతుందని తెలిపారు. కంటి పరీక్షలు చేయించుకునే వారు ఓటరు గుర్తింపుకార్డు, రేషన్‌కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు లేదా ఆధార్ కార్డు తీసుకురావాలని సూచించారు. కంటి శుక్లాల సమస్య ఉన్న వారికి శస్త్రచికిత్స చేస్తారన్నారు. మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు షేక్ సర్ఫరాజ్, నాయకులు పల్లె సురేష్, మాజీ సర్పంచ్ అంజనేయులుగౌడ్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి



మక్తల్: తెలంగాణ రాష్ట్ర ప్రగతిశీల హమాలీ అండ్ రైస్‌మిల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ నెల 21న ఖమ్మంలో నిర్వహించే రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు కిరణ్ కోరారు. మహాసభలకు సంబంధించిన పోస్టర్లను ఆదివారం మక్తల్ మార్కెట్‌యార్డులో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 3లక్షల మందికి పైగా హమాలీలు పనిచేస్తున్నారన్నారు. వారందరికీ రూ. 26వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. హమాలీల సమస్యల పరిష్కారం కోసం నిర్వహించతలపెట్టిన మహాసభలకు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. యూనియన్ నాయకులు లక్ష్మన్న, రాజు, నాగప్ప, ఎర్రంజప్ప పాల్గొన్నారు.

సంతలో అన్నదానం



నవాబుపేట: మండల కేంద్రంలో ప్రతి ఆదివారం జరిగే సంతకు వచ్చే జనాల కోసం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహచారి ఉచిత భోజనం అందిస్తున్నారు. ఆరునెలలుగా ఈ కార్యక్రమం కొనసాగుతోంది. జన అందిస్తున్నారు. సంతకు వచ్చే మారుమూల గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుంటున్నారు. సంతకు వచ్చి తిరిగి వెళ్లేందుకు రాత్రి అవుతుండటంతో వారికి మధ్యాహ్నం భోజనం అందించి ఆకలి తీరుస్తుండటంతో ఈకార్యక్రమం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తునా్రు. కార్యక్రమంలో వ్యాపార సంఘం మండలాధ్యక్షుడు సుధాకర్‌చారి, పుట్టి అంజనేయులు, రఘువీర్‌శర్మ, నిరంజన్, లక్ష్మీనర్సింహాచారి, గీతారాణి, విశ్వనేత్ర, చందు, వెంకటయ్య పాల్గొన్నారు.

మోడల్ టెస్టుకు అపూర్వ స్పందన

ఆత్మకూర్: నవోదయ, గురుకులాల్లో ప్రవేశానికి సంబంధించి ఆదివారం విద్యార్థులకు నిర్వహించిన మోడల్ టెస్టుకు అపూర్వ స్పందన లభించినట్లు నిర్వాహకులు మీర్జా అన్వర్ బేగ్, మీర్జా అక్తర్‌బేగ్ తెలిపారు. స్థానిక వికాస్ కళాశాలలో నిర్వహించిన మోడల్ టెస్టుకు ఉమ్మడి జిల్లా నుంచి విద్యార్థులు భారీగా హాజరైనట్లు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఐదో తరగతిలో ప్రవేశ పరీక్షలు జరుగుతున్నాయని.. విద్యార్థులను సన్నద్ధం చేసేందుకు మోడల్ టెస్టు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించండి

అమరచింత: భవన నిర్మాణ కార్మికులకు పెండింగ్ బిల్లులను చెల్లించాలని ప్రగతిశీల భవన నిర్మాణ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రాజు డిమాండ్ చేశారు. స్థానిక మార్క్స్ భవనంలో ఆదివారం నిర్వహించిన భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల పోరాట ఫలితంగా 1996లో కేంద్ర ప్రభుత్వం కార్మికుల సంక్షేమబోర్డు ఏర్పాటు చేసిందన్నారు. రాష్ట్రంలో సంక్షేమ బోర్డు ఏర్పాటు కోసం కార్మికులు అనేక దఫాలుగా పోరాటం చేయడంతో 2009లో భవన, ఇతర నిర్మాణరంగ కార్మిక బోర్డు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సంక్షేమబోర్డు వచ్చిన తర్వాత కార్మికులకు ఇచ్చే బెనిఫిట్స్ తక్కువగా చెల్లిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులకు అందాల్సిన క్లెయిమ్స్ అందే వరకు ఆందోళన కొనసాగిస్తామన్నారు.

అప్పంపల్లికి 'శివారు' కష్టాలు

- 50 ఏళ్లుగా రెవెన్యూ గ్రామంగా నోచుకోని వైనం
- ఆరు గ్రామాల శివారులో వ్యవసాయ భూములు
- ప్రత్యేక రెవెన్యూ గ్రామంగా గుర్తించాలని గ్రామస్తుల వేడుకోలు

మరికల్: మండలంలోని అప్పంపల్లిని ప్రత్యేక రెవెన్యూ గ్రామంగా గుర్తించాలని కొన్ని దశాబ్దాలుగా గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయమై ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవిస్తూ వస్తున్నారు. అయితే తరాలు మారుతున్నా గ్రామ ముఖచిత్రం మాత్రం మారడం లేదు. ఎందరో సర్పంచులు, మరెందరో అధికారులు మారుతున్నా రెవెన్యూ గ్రామం హోదా మాత్రం దక్కడం లేదు. మొదటి సర్పంచ్ నుంచి తాజా మాజీ సర్పంచ్ వరకు సుమారు 50 ఏళ్లుగా అప్పంపల్లిని రెవెన్యూ గ్రామంగా గుర్తించాలని తహసీల్దార్ నుంచి ముఖ్యమంత్రి వరకు వినతిపత్రాలను సమర్పించినా ఫలితం లేకుండాపోయింది. రెవెన్యూ గ్రామం కల కలగానే మారింది.

ఇదీ పరిస్థితి..

మరికల్ శివారులోని 30 ఎకరాల్లో అప్పంపల్లి గ్రామపంచాయతీగా అవతరించింది. గ్రామంలో 356 కుటుంబాలు ఉండగా.. 2,625 మంది జనాభా ఉంది. గ్రామంలోని ప్రతి కుటుంబం వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తోంది. 2,511 ఎకరాల భూములు అప్పంపల్లి గ్రామ రైతుల పేరిట భూములు ఉన్నాయి. వీటిలో 150 ఎకరాల అసైన్డ్ భూమి ఉంది. మూడు చెరువులు, ఐదు కుంటలు, ఎనిమిది చెక్‌డ్యాంలు గ్రామ పరిధిలో ఉన్నాయి. 95 శాతం అక్షరాస్యత సాధించిన గ్రామంగా రికార్డు ఉంది. అయితే అప్పంపల్లి గ్రామ రైతుల భూములు ఇతర గ్రామాల రెవెన్యూ శివారులో ఉండటం గమనార్హం. మొత్తం ఆరు గ్రామాల శివారు పరిధిలోకి అప్పంపల్లి భూములు వస్తున్నాయి. దీంతో గ్రామానికి రెవెన్యూ పరంగా వచ్చే ఆదాయానికి గండి పడుతోంది. బ్యాంకు రుణాలు, పంటనష్ట పరిహారం, భూ సమస్యలు తదితర వాటికి గ్రామస్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. సొంత శివారు కోసం దశాబ్దాల నుంచి పోరాడుతున్నా గ్రామస్తుల కల మాత్రం నెరవేరడం లేదు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి అప్పంపల్లిని రెవెన్యూ గ్రామంగా గుర్తించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



అప్పంపల్లి గ్రామ వ్యూ

ఇతర గ్రామాల శివారులో ఉన్న అప్పంపల్లి భూముల వివరాలిలా (ఎకరాల్లో)..

మరికల్	పస్పుల	మందిపల్లి	మాధ్వార్
1,020	715	413	212
ధన్వాడ	రాంకిష్టయ్యపల్లి		మొత్తం
101	50		2,511



పస్పుల శివారులో పంట పొలంలో పనిచేస్తున్న అప్పంపల్లి గ్రామ రైతు

ఇబ్బందులు పడుతున్నాం..



నాకు మరికల్ రెవెన్యూ శివారులో 11 ఎకరాల భూమి ఉంది. మా గ్రామానికి ప్రత్యేకంగా రెవెన్యూ గుర్తింపు లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. బ్యాంకు రుణాలు పొందాలన్నా.. భూములు విక్రయించాలన్నా అవస్థలు పడుతున్నాం. ప్రభుత్వం స్పందించి అప్పంపల్లిని రెవెన్యూ గ్రామంగా గుర్తించాలి.

– నర్సిరెడ్డి, రైతు, అప్పంపల్లి

ఆదాయం కోల్పోతున్నాం..



ఎన్నో ఏళ్ల నుంచి రెవెన్యూ గ్రామంగా గుర్తించాలని కోరుతున్నాం. ఆరు రెవెన్యూ గ్రామాల శివారులో మా భూములు ఉండటం వల్ల శిస్తులు కాని, భూముల క్రయవిక్రయాలు జరిగినప్పుడు రెవెన్యూ పరంగా వచ్చే ఆదాయం ఇతర గ్రామాలకే పోతుంది. తమ కంటే చిన్న పల్లెలు రెవెన్యూ గ్రామాలుగా ఉన్నాయి. అప్పంపల్లిని కూడా రెవెన్యూ గ్రామంగా ఏర్పాటు చేయాలి.

– కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్, అప్పంపల్లి

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం..

అప్పంపల్లిని రెవెన్యూ గ్రామంగా మార్చాలనే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. ప్రభుత్వం కొత్త రెవెన్యూ గ్రామాలను ఏర్పాటు చేయాలని ఉత్తర్వులు జారీ చేస్తే తప్పకుండా అప్పంపల్లి పేరును నమోదు చేస్తాం.

– అనిల్‌కుమార్, తహసీల్దార్, మరికల్

క్రీడాకారులకు సన్మానం



మక్తల్: జాతీయస్థాయి షూటింగ్‌బాల్ పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులకు ఆదివారం జిల్లా షూటింగ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక క్రీడా ప్రాంగణంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సత్యాంజనేయులు, ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్ మాట్లాడుతూ.. ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి షూటింగ్‌బాల్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు పరశురాముడు, సురేష్, రాజేష్, రఘు, అఖిల, నవ్యశ్రీ, గాయత్రి, శ్రీలత, స్వప్న, అరుణ, శ్రావణి అత్యుత్తమ ప్రతిభకనబరిచి ఈ నెల 21 నుంచి నల్లగొండలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభకనబరిచి విజేతగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గోపాలం, పీఈటీ శ్రీలత, గాయత్రి, ఓబులేష్, శివకుమార్ పాల్గొన్నారు.

ముగిసిన రాజ్వాలి ఉత్సవాలు



అమరచింత: మూడు రోజుల పాటు పట్టణంలో కొనసాగిన సయ్యద్ షా రాజ్వాలి దర్గా షరీఫ్ ఉత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ఆదివారం ఖత్మేఖురాన్ ఫాతేహ కార్యక్రమంలో ఆల్ఇండియా కృష్ణ, మహేష్ బాబు ఫ్యాన్స్ జాతీయ అధ్యక్షుడు ఖాదర్ గోరి పాల్గొని ప్రత్యేక ప్రార్థన నిర్వహించారు. అనంతరం ఉత్సవాలకు వచ్చిన భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో యాన్మన్ గండ్ల లక్ష్మణ్, నాగకృష్ణ, సమద్, దర్గా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు తగదు



మాట్లాడుతున్న నాగరాజుగౌడ్

మక్తల్: నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషిచేస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిపై కొందరు పనిగట్టుకొని అసత్య ఆరోపణలు చేయడం తగదని రాష్ట్ర గీత కార్మిక సంఘం అధ్యక్షుడు నాగరాజుగౌడ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మక్తల్, ఆత్మకూర్, నర్వ, అమరచింత, ఊట్కూర్, కృష్ణా, మాగనూర్ మండలాల్లోని కల్లు సొసైటీల నుంచి ఎమ్మెల్యేకు మామూళ్లు ఇస్తున్నారని వాట్సప్ గ్రూపుల్లో కొందరు పోస్టులు పెట్టడం హేయనీయమన్నారు. కల్లు సొసైటీల నుంచి తాము ఎవరికీ నయా పైసా ఇవ్వడం లేదన్నారు. కులవృత్తిని నమ్ముకొని జీవనం సాగిస్తున్నామన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా ఇలాంటి చిల్లర ఆరోపణలు చేయడం సరి కాదన్నారు. దమ్ము, ధైర్యం ఉంటే అందరి ముందుకు వచ్చి మాట్లాడాలని అన్నారు. ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి ప్రజల్లో లభిస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక అసత్య ఆరోపణలు చేస్తున్నారని.. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో మండల గౌడ సంఘం అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ చంద్రకాంత్‌గౌడ్, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి శివన్నగౌడ్, మాజీ సర్పంచులు బస్వరాజుగౌడ్, వెంకట్రాములుగౌడ్, విజయమ్మ, లక్ష్మీనారాయణగౌడ్, నర్సింహులుగౌడ్, శంకర్‌గౌడ్, నాగరాజు, గంగాధర్, కిష్టయ్య, అశోక్ ఉన్నారు.

కరాటే చాంపియన్‌షిప్‌లో కేజీబీవీ విద్యార్థినుల ప్రతిభ



మద్దూరు: జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం నిర్వహించిన 24వ నేషనల్ కరాటే కుంగ్‌ఫూ చాంపియన్‌షిప్‌లో పెదిరిపాడ్ కేజీబీవీ విద్యార్థినులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. వివిధ విభాగాల్లో ఆరో తరగతి విద్యార్థిని మల్లీశ్వరి, ఏడోతరగతి విద్యార్థిని అక్షిత గోల్డ్‌మెడల్స్ సాధించారు. ఆరో తరగతికి చెందిన తేజస్విని సిల్వర్, భార్గవి రజత పతకం సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ గౌరమ్మ తెలిపారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



అప్పక్‌పల్లిలోని కిరాణా దుకాణంలో తనిఖీ చేస్తున్న పోలీసులు

నారాయణపేట రూరల్: మత్తు పదార్థాలకు అందరూ దూరంగా ఉండాలని ఎస్‌ఐ రాయుడు కోరారు. నారాయణపేట మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం నార్కోటిక్స్ స్నైపర్ పోలీసు డాగ్‌తో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల వినియోగం, అక్రమ రవాణా జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. గ్రామాల్లోని కిరాణా దుకాణాలు, శివారు ప్రాంతాల్లోని పొలాలు, కొరియర్ సెంటర్లపై నిఘా ఏర్పాటుచేసినట్లు తెలిపారు. గ్రామాల్లో మత్తు పదార్థాలు వినియోగించినా, రవాణా చేసినా డయల్ 100కు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. సదరు వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ శ్యామప్ప, నార్కోటిక్స్ స్నైపర్ డాగ్ హ్యాండ్లర్ పరమేష్ పాల్గొన్నారు.

పెద్దకడ్మూర్‌లో ఆధ్యాత్మిక శోభ



బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో హోమం చేస్తున్న భక్తులు

నర్వ: మండలంలోని పెద్దకడ్మూర్ బాలబ్రహ్మేశ్వర ఆలయంలో నిర్వహిస్తున్న దేవతా విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవాలతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. రెండు రోజులుగా వేదమంత్రోచ్ఛారణల మధ్య గణపతి, సుబ్రహ్మణేశ్వర స్వామి, పార్వతీ దేవి, నాగుల విగ్రహాలతో పాటు నవగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన పూజా కార్యక్రమాలను కనులపండువగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ధాన్యాదివాసం, శయనాధివాసం కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సోమవారం విగ్రహాల ప్రతిష్ఠాపనకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని.. కార్యక్రమానికి పశ్చిమాద్రి విరక్తిమఠం పీఠాధిపతి పంచమ సిద్ధ లింగస్వామి, అంబత్రయ త్రిశక్తి పీఠం పీఠాధిపతి ఆదిత్య పరశ్రీస్వామితో పాటు మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో బీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రవి కుమార్‌యాదవ్, చేవెళ్ల ఆర్డీఓ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాసవీమాత ఆలయ వార్షికోత్సవం



ఆలయంలో కుంకుమార్చన నిర్వహిస్తున్న భక్తులు

మద్దూరు: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి ఆలయ 10వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు రాఘవేంద్రాచారి, మధుసూదనాచారి మంత్రోచ్చారణల మధ్య ధ్వజారోహణం, అభిషేకాలు, అష్టోత్తర శతనామావళి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం కలశాలతో ఊరేగింపు చేపట్టారు. పలువురు దంపతులు సామూహికంగా సత్యనారాయణ స్వామి వ్రతం ఆచరించారు. మహిళలు అమ్మవారికి కుంకుమార్చన చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు విజయ్‌కుమార్, నాగులు, రవికుమార్, రాజయ్య, కృష్ణయ్య, శ్రీనివాస్, కుమార్, శేఖర్, భీమశంకర్ తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన శివనామస్మరణ

నారాయణపేట/నారాయణపేట రూరల్/ఊట్కూరు/ధన్వాడ: జిల్లా కేంద్రంలో ఆదివారం శివనామస్మరణ మార్మోగింది. మహంకాళి వీధిలోని శివాలయంలో ఆదిదేవుడి మహాపూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా శివస్వాములు జ్యోతి, కలశాలతో గణేష్ మార్గం మీదుగా భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం గురుస్వాములు సత్యయాదవ్, కన్నా జగదీశ్, బండి గోపాల్‌రెడ్డి నర్సింహ స్వామి, గిరప్ప ఆధ్వర్యంలో మహాదేవుడికి మహాపూజ, రుద్రాభిషేకం, శివాష్టకం, అభిషేకం, బిల్వాష్టకం కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. మహాపూజ అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ చేశారు.

➩ నారాయణపేట మండలంలోని జాజాపూర్‌లో ఆదివారం శివస్వాముల మహా పడిపూజ కార్యక్రమం కనులపండువగా జరిగింది. స్థానిక శివాలయంలో ద్వాదశ జ్యోతిర్లింగాలతో ప్రత్యేక మండపాన్ని ఏర్పాటుచేసి.. గురుస్వామి రాజ్ కుమార్, పవన్ ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకం, బిల్వార్చన, పుష్పాలంకరణ, మహా మంగళహారతి తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అంతకుముందు స్వామివారి ఉత్సవమూర్తిని పల్లకీలో గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.



జిల్లా కేంద్రంలో శివలింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు

➩ ఊట్కూరు మండలంలోని ఓబులాపూర్ శివాలయంలో శివస్వాముల ఇరుముడిధారణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి రుద్రాభిషేకం, అలంకరణ తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఇడుముడి కట్టుకున్న శివస్వాములు శ్రీశైల క్షేత్రానికి పాదయాత్రగా బయలుదేరారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ వెంకటేష్‌గౌడ్, అంజప్ప, యఘ్నేశ్వర్‌రెడ్డి, రాములు, వెంకటప్ప పాల్గొన్నారు.

➩ ధన్వాడ మండల కేంద్రం నుంచి శివస్వాములు పాదయాత్రగా శ్రీశైలం క్షేత్రానికి బయలుదేరారు. అంతకుముందు ఇరుముడిధారణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.



నారాయణపేట మండలం జాజాపూర్‌లో..



ఊట్కూరు మండలం ఓబులాపూర్‌లో..



ధన్వాడలో..

ఉద్యమాలతోనే సమస్యల పరిష్కారం



ఆత్మకూర్‌లో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీని సత్కరిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

ఆత్మకూర్: ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని, ప్రజలకు పాలకులు ఇచ్చిన హామీల అమలు కోసం ప్రలందరు కలిసిరావాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. ఆదివారం సాయంత్రం ఆత్మకూర్‌కు వచ్చిన ఆయనకు సీపీఎం, సీపీఐ, ఎంఆర్‌పీఎస్, ఆవాజ్ కమిటీ, ప్రజా సంఘాల నాయకులు ఘనస్వాగతం పలికి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తనపై నమ్మకంతో సీపీఎంపార్టీ రాష్ట్రకార్యదర్శిగా బాధ్యతను అప్పగించిందని ప్రతినిత్యం బడుగు బలహీనవర్గాల అభ్యున్నతి కోసం కృషి చేస్తానని, తనను సత్కరించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రాజు, రాబర్ట్, మోష, సీఎస్‌శెట్టి, లక్ష్మణ్, మాసన్న, జానకీరాం, జహంగీర్, దండు శ్రీను, గయాసుద్దీన్, ఖాజాపాష, భట్టిపాష, జూరాల పాష, ఖలీల్, తదితరులు ఉన్నారు.

మహా మండపం నిర్మాణానికి సర్వే



కురుమూర్తిస్వామి ఆలయం వద్ద సర్వే నిర్వహిస్తున్న అధికారులు

చిన్నచింతకుంట: కురుమూర్తి స్వామి ప్రధాన ఆలయం ధ్వజస్తంభం ముందు మహా మండపం నిర్మాణం చేపట్టేందుకు ఆదివారం అధికారులు ఆలయం వద్ద సర్వే నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ కురుమూర్తిస్వామి దర్శనానికి దినదినాన భక్తుల తాకిడి అధికం అవుతుందన్నారు. ముఖ్యంగా అమవాస్య, స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భక్తుల సంఖ్య పెరుగుతుందని అన్నారు. దీంతో స్వామివారి దర్శనానికి భక్తులు గంటల తరబడి క్యూలైన్లలో నిల్చుంటున్నారన్నారు. భక్తుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని మహా మండపం నిర్మాణం చేపట్టేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

రైలు ఢీకొని ఎద్దులు మృతి

దేవరకద్ర రూరల్: రైలు ఢీకొని రెండు ఎద్దులు మృతి చెందిన ఘటన ఆదివారం కౌకుంట్ల రైల్వేస్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. పుట్టపల్లికి చెందిన రైతు గొల్ల కురుమూర్తి తన ఎద్దులను తీసుకొని పొలానికి వెళ్తున్నాడు. ఆదే సమయంలో అటుగా వెళ్తున్న రైలు శబ్దం చేయడంతో ఎద్దులు భయపడి పట్టాల వైపుగా పరిగెత్తడంతో రైలు ఢీ కొట్టింది. ఈ సంఘటనలో రెండు ఎద్దులు అక్కడికక్కడే మృతి చెందాయి. మృతి చెందిన ఎద్దుల విలువ దాదాపు రూ. 2లక్షల వరకు ఉంటుందని, వీటిపైనే ఆధారపడి జీవిస్తున్నట్లు బాధిత రైతు వాపోయాడు. అధికారులు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు.